క్లుప్తంగా

నర్సీపట్నం అసెంబ్లీకి పది నామినేషన్లు



ఎన్నికల రిటర్నింగ్ అధికారి జయరాం

నర్సీపట్నం : నామినేషన్ల స్వీకరణ గడువు ముగిసే నాటికి నర్సీపట్నం అసెంబ్లీ స్థానానికి పది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెచ్.వి.జయరాం గురువారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా పెట్ల ఉమాశంకర్ గణేష్, పెట్ల కళావతి, టీడీపీ నుంచి చింతకాయల అయ్యన్నపాత్రుడు, చింతకాయల రాజేష్, కాంగ్రెస్ పార్టీ నుంచి రుత్తల శ్రీరామ్మూర్తి, బీఎస్పీ బొట్టా నాగరాజు, జైభీమ్ రావ్ భారత్ పార్టీ నుంచి నేతల నాగేశ్వరరావు, ఇండిపెండెంట్‌గా బయపురెడ్డి భద్రాచలం, పైల సూర్య గణేష్ ఎమ్మెల్యే అభ్యర్థులుగా నామినేషన్లు వేశారని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

గొలుగొండ: మండలంలో నాగాపురం, ఎ.ఎల్.పురం, కృష్ణదేవిపేట, లింగంపేట, చోద్యం, అమ్మపేట తదితర గ్రామాల్లో శుక్రవారం ఉదయం నుండి రాత్రి వరకు నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ తెలిపారు. ఆయా గ్రామాల్లో జరిగే కార్యక్రమానికి మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన కోరారు.

వైభవంగా గ్రామదేవతల పండగలు



భీమబోయినపాలెంలో ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

మాకవరపాలెం : గ్రామదేవతల పండగలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని భీమబోయినపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో మరిడమ్మ, రామన్నపాలెంలో బండితల్లి పండగలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రికి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ఎంసీసీ నోడల్ అధికారి తనిఖీ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంసీసీ నోడల్ ఆఫీసర్

నర్సీపట్నం : నాతవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంసీసీ నోడల్ ఆఫీసర్ గురువారం తనిఖీ చేశారు. మన్యపురట్ల సచివాలయం పరిధిలోని 92,93 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సచివాలయ సిబ్బందికి ఎన్నికల నియమావళిపై సూచనలు ఇచ్చారు. గన్నవరం చెక్‌పోస్టు తనఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు సక్రమంగా ఉండేటట్టు చూసుకోవాలని, సౌకర్యాలు లేని పక్షంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకువెళ్లాలని సచివాలయ సిబ్బంది, బీఎల్‌వోలకు సూచించారు.

మహానేతల ఆశయాలను నెరవేర్చాలి



గుర్రాజుపేటలో ఆవిష్కరించిన అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలు

ఎస్.రాయవరం : దేశ ప్రయోజనాల కోసం పాటుపడిన మహానేతల ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని బర్రె అప్పారావు, దాట్ల శ్రీరామరాజు అన్నారు. గుర్రాజుపేట గ్రామంలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలను గురువారం ప్రారంభించారు. విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. జగన్ సేవాదళ్ సభ్యులు కనికళ్ల అమ్మాజీ, సమతా సైనిక్‌దళ్ నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు మేలు చేశాం...ఆశీర్వదించండి

- నియోజకవర్గంలో శాశ్వత అభివృద్ధి పనులు
- నాతవరంలో జూనియర్ కాలేజీ మంజూరు చేశాం
- చంద్రబాబు, అయ్యన్నలను నమ్మి మోసపోవద్దు
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



పి.కె.గూడెం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్



ఉత్సాహంగా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే

నాతవరం : నియోజకవర్గంలో శాశ్వతంగా నిలిచిపోయే పనులు చేశామని, మళ్లీ ఆశీర్వదిస్తే అన్ని వర్గాల ప్రజలకు మరింత మేలు చేసే పనులు చేస్తామని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. మండలంలో పి.జగ్గంపేటలో గురువారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. పి.కె.గూడెం గునుపూడి చినగొలుగొండపేట పెద గొలుగొండపేట వెదురుపల్లి గుమ్మడిగొండ చమ్మచింత పంచాయతీల్లో ఎండను సైతం ఖాతరు చేయకుండా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేకు అడుగడుగునా మహిళలు హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఆయా సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ హయాంలో చేయలేనిది నాతవరంలో జూనియర్ కాలేజీ మంజూరు చేశామని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి దూర ప్రాంతాలకు మీ పిల్లలు పోకుండా ఇక్కడే కాలేజీలో చదువుకోవచ్చునన్నారు. ఏళ్ల తరబడి భూములు సాగు చేసుకుంటున్న పి.కె.గూడెం, పి.జగ్గంపేట, గునుపూడి గ్రామాల్లో రైతులకు శాశ్వతంగా మేలు చేశామన్నారు. జగనన్న భూ రీ సర్వే ద్వారా నిబంధనల ప్రకారం అర్హత ఉన్న రైతులందరికీ ఆన్‌లైన్ పక్రియ పూర్తి చేశామని చెప్పారు. ఎన్నికల కోడ్ కారణంగా పోస్టల్ ద్వారా పాసుపుస్తకాలు ఇంటికే పంపించడం జరుగుతుందన్నారు. మాకవరపాలెంలో మెడికల్ కాలేజీ పనులు, గొలుగొండ వెళ్లే ఆరిలోవ రోడ్డు పనులు యుద్ధ ప్రతిపాదికన జరుగుతున్నాయని, అలాగే నర్సీపట్నంలో ఏళ్ల తరబడి ప్రజలు ఎదురు చూస్తున్న రోడ్డు విస్తరణ పనులు చేపట్టామని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించేందుకు ఓటర్లంతా ఆశీర్వదించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అందించడంతో పాటు, మండల కేంద్రాలకు వెళ్లకుండా సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా గ్రామంలోనే అన్ని ప్రభుత్వ సేవలు అందిస్తున్నామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలు బహిరంగంగా మేము చెప్పుకుంటామని, కానీ టీడీపీ వాళ్లకు తమలా చెప్పే ధైర్యం లేదని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బూడి ముత్యాలనాయుడుకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 2014లో చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచారన్నారు. ఇప్పుడు మళ్లీ గ్రామాల్లో మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేసేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. చంద్రబాబు, అయ్యన్న చెప్పే మోసపూరిత మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దన్నారు. ప్రచార కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగ గోపి, మండల పార్టీ అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు గన్నవరం పి.కె.గూడెం పీఏసీఎస్ పర్సన్ ఇంఛార్జిలు గొర్లె వరహాలబాబు, ఎ.వరహాలబాబు, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శిరుసుపల్లి సర్వింగరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జివిరెడ్డి సోమన్నదొర గాడి రమేష్ వేముల సూర్యనారాయణ పోలుపర్తి వెంకటరమణ, అంకంరెడ్డి పాలురాజు, మిరపల వెంకటరమణ, తమరాన సత్యనారాయణ, గుడపర్తి అచ్చియ్యనాయుడు, కాళ్ల సత్యనారాయణ, పంచాడ పాప, సుర్ల పాప, శెట్టి నూకరాజు, సుర్ల అచ్చియ్యనాయుడు, కాళ్ల నాగబాబు, వేముల సూరిబాబు, కరక అప్పలరాజు, ఉలబాల శ్రీను, మంకు సాంబమూర్తి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్‌కు హారతులతో ఘన స్వాగతం పలుకుతున్న మహిళలు

ప్రచారంలో వైఎస్సార్‌సీపీ జోష్



కొరుప్రోలులో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



గుడివాడలో ఉపాధి కూలీలను ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని చెబుతున్న నాయకులు

ఎస్.రాయవరం: వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంబాల జోగులుకు మద్దతుగా గ్రామాల్లో ఎన్నికల ప్రచార జోరు పెంచారు. గడిచిన ఐదేళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు ఏ మేర లబ్ధి చేకూరాయో లబ్ధిదారులు అభిప్రాయాలు తెలుసుకుని ప్రచారం చేస్తున్నారు. ప్రతి ఒక్కరి నోటా మేము ప్రతి పథకంలోనూ లబ్ధి పొందామని, వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మరోమారు జగన్‌బాబును సీఎంగా గెలిపించుకుంటామంటూ స్పష్టం చేయడంతో పార్టీ నాయకులు ఉత్సాహంగా ప్రచారంలో దూసుకుపోయారు. కొరుప్రోలు, పి.ధర్మవరం తదితర గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో ఎంపీటీసీ కేసుబోయిన వెంకటలక్ష్మి, కొరుప్రోలు నూకాంబిక అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ కొంగర రాజు, రామాలయ ఆలయ కమిటీ చైర్మన్ యరమాటి సూర్యారావు, మాజీ చైర్మన్ కోరా సూరిప్రకాష్ రావు, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ కోరెడ్డి సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరా జగదీష్, ఈగల సత్తిబాబు, పేరిచర్ల శ్రీపతిరాజు, గుడివాడ సర్పంచ్ దూళి శ్రీనుబాబు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి మళ్లీ పట్టం కట్టండి



పాయకరావుపేటలో నాయకుల ప్రచారం

పాయకరావుపేట : రాష్ట్రంలో మే13న జరగబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకి ఓటు వేసి సంక్షేమ పాలనకి పట్టం గట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి, ప్రతి అర్హులకు అందాలంటే మరలా రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డినే మనందరం గెలిపించుకోవాలన్నారు. సీఎం జగన్ పాలనలో విద్య, వైద్యానికి పెద్దపీట వేసి నాడు నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రజల వద్దకు పాలనే లక్ష్యంగా ప్రతి గ్రామంలోను, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం మంజూరు చేసి, ఇంటి నిర్మాణానికి రుణం అందించడం జరిగిందన్నారు. మహిళ ఆర్థికాభివృద్ధి కోసం పొదుపు సంఘాలకు సున్నావడ్డీ పథకం, ఆసరా, చేయూత, కాపునేస్తం, నేతన్న నేస్తం పథకాల ద్వారా నగదు సహాయం అందజేయడం జరిగిందన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ల ద్వారా సామాజిక పింఛన్లు ఇళ్ల వద్దకే అందిస్తున్నారన్నారు. రైతులకు రైతుభరోసా, విత్తనాలు పంపిణీ, ధాన్యం కొనుగోలు, ఎరువులు పంపిణీ సకాలంలో అందిస్తున్నారన్నారు. ఈ సంక్షేమం కొనసాగాలంటే మరలా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులును, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడిని గెలిపించుకోవాలన్నారు. పట్టణంలో రాజుగారిబీడు, న్యూ కాలనీల్లో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బాబూరావు, ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, అన్నవరం దేవస్థానం డైరెక్టర్ సుందర్రావు, వార్డు సభ్యుడు జగతా శ్రీను, నాయకులు సత్తిబాబు, ధనిశెట్టి బుజ్జి, కొశిరెడ్డి నాగేశ్వరరావు, తులసి పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

- పాయకరావుపేట స్థానానికి 18 నామినేషన్లు
- నేడే పరిశీలన
- ఉపసంహకరణకు ఈ నెల 29 వరకు గడువు



వైఎస్సార్‌సీపీ నుంచి డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న కంబాల సందీప్



బహుజన సమాజ్‌వాదీ పార్టీ నుంచి నామినేషన్ దాఖలు చేస్తున్న నరిసింగరావు

నక్కపల్లి : సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ల పర్వం ముగిసింది. పాయకరావుపేట అసెంబ్లీ స్థానానికి చివరి రోజైన గురువారం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయని ఆర్‌వో గీతాంజలి తెలిపారు. మొత్తం 11 మంది అభ్యర్థులు 18 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారని ఆమె తెలిపారు. ఈసారి ఎన్నికల్లో బహుజన్ సమాజ్‌వాది పార్టీ తరపున కూడా అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయడం గమనార్హం. అలాగే వైఎస్సార్‌సీపీ తరపున డమ్మీ అభ్యర్థిగా పార్టీ ఉత్తరాంధ్ర ఎస్సీ సెల్ కన్వీనర్ కంబాల సందీప్ కూడా నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున ఇద్దరు రెబెల్స్ కూడా నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లు దాఖలు చేసిన వారి వివరాలిలా ఉన్నాయి.

1. కంబాల జోగులు (వైఎస్సార్‌సీపీ) 3 సెట్లు
2. వంగలపూడి అనిత (టీడీపీ) 4 సెట్లు
3. బోని తాతారావు (కాంగ్రెస్) 3 సెట్లు
4. దూలపల్లి నాగేశ్వరరావు (జైభారత్ నేషనల్ పార్టీ) 1 సెట్
5. వడ్లమాని కృష్ణ స్వరూప్ (దళిత బహుజన్‌పార్టీ) 1 సెట్
6. పరవాడ రామకృష్ణ (ప్రభుద్ద రిపబ్లిక్ పార్టీ) 1 సెట్
7. కాకర నరిశింగరావు (బహుజన సమాజ్‌పార్టీ) 1 సెట్
8. మారుతి నారాయణ చక్రవరి కాంగ్రెస్ రెబెల్ (స్వతంత్ర) 1 సెట్
9. బుర్తి ఏసియ్య. కాంగ్రెస్ రెబెల్(స్వతంత్ర) 1 సెట్
10. శెట్టి బోతుల ధర్మరాజు (స్వతంత్ర) 1 సెట్
11. కంబాల సందీప్ వైఎస్సార్‌సీపీ డమ్మీ 1 సెట్

దాఖలయిన నామినేషన్ల పరిశీలన శుక్రవారం ఉదయం ప్రారంభమవుతుందని ఆర్వో తెలిపారు. నామినేషన్ల దాఖలు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఈ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని సహాయ రిటర్నింగ్ అధికారి, నక్కపల్లి తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు.

జగన్ పాలనలో ప్రతి కుటుంబం సుభిక్షం

- ఈ సంక్షేమం కొనసాగాలంటే జగనే సీఎం కావాలి
- పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు



బోడపాలెంలో ఎమ్మెల్యే అభ్యర్థి జోగులుకు హారతినిస్తున్న మహిళ



పి.కె.పల్లిలో కరపత్రాలు చూపించి ఫ్యాను గుర్తుపై ఓటెయ్యాలంటున్న జోగులు

కోటవురట్ల : సీఎం జగన్ పాలనలో ప్రతి కుటుంబం సుభిక్షంగా ఉందని, సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని పాయకరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు అన్నారు. ఎన్నికల ప్రచారంలో జోరు పెంచిన జోగులు తనదైన శైలిలో ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించి ఫ్యాను గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్నారు. పి.కె.పల్లి, రామన్నపాలెం, కొత్తూరు, బోడపాలెం, పి.తంగేడు గ్రామాలలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి చోట ఆయనకు సాదర స్వాగతం లభించింది. దుష్టుల మాటలు విని మోసపోవద్దని, పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే ఈ సంక్షేమ పథకాలన్నీ ఆగిపోతాయని తెలిపారు. అవ్వా తాతలు సంతోషంగా ఉండాలన్నా, చిన్నారులకు బంగారు భవిత రావాలన్నా మళ్లీ జగనే రావాలన్నారు. సీఎం జగన్ ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో సువర్ణ పాలన అందించారన్నారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ప్రతి ప్రాణాన్ని జాగ్రత్త కాపాడుతూ సంక్షేమ పథకాలను అందించారన్నారు. ప్రతి గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం, సచివాలయం, డిజిటల్ లైబ్రరీలు నిర్మించి ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లారన్నారు. ప్రతిపక్షాలు గతంలో ఏం చేయకపోయినా అభివృద్ధి జరగలేదంటూ దుష్ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఎంఎస్ఎంఈ చైర్మన్ డి.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజు మాట్లాడుతూ సీఎం జగన్ వలంటీరు వ్యవస్థతో అవ్వాతాతలకు క్రమం తప్పకుండా ఒకటో తేదీనే పింఛను డబ్బులు ఇంటికి పంపించారని గుర్తు చేశారు. చంద్రబాబుకు పొరపాటున ఓటేస్తే వలంటీర్లను తీసేసి జన్మభూమి కమిటీలను తీసుకొస్తాడన్నారు. ప్రజలు విజ్ఞతతో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎమ్మెల్యేగా కంబాల జోగులుకు, ఎంపీగా బూడి ముత్యాలనాయుడుకు ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి మంచి మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శింగంపల్లి అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి యల్లపు కుమారరాజా, సర్పంచులు పోలుపర్తి అప్పన్న, శింగంపల్లి ఎరుకునాయుడు, వై.బెన్నమ్మ, కొరుప్రోలు శివకుమార్, ఎంపీటీసీ పెట్ల రాంబాబు, పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, శింగంపల్లి కిషోర్, పోతల సత్తిబాబు, రమణ, లోకారపు బాబులు, రాంప్రసాద్, రొంగల వెంకటరమణ, శానాపతి రామునాయుడు, పైల నాని, అల్లు కిషోర్ పాల్గొన్నారు.

రోజూ పది పంచాయతీల్లో ప్రచారం



జంగాలపల్లిలో స్థానిక నేతలతో మాట్లాడుతున్న ఎంపీపీ, తదితరులు

మాకవరపాలెం ఈ నెల 28 నుంచి మండలంలో జరిగే ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ జేష్ ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు గురువారం మల్లవరం, గిడుతూరు. పి.పి.అగ్రహారం, జంగాలపల్లి, బి.ఎస్.పేట గ్రామాల్లో పర్యటించి స్థానిక నేతలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 28, వచ్చేనెల 2, 5 తేదీల్లో రోజుకు పది పంచాయతీల్లో ఎమ్మెల్యే గణేష్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పర్యటిస్తారన్నారు. ఈ పర్యటనను నాయకులు, కార్యకర్తలు సమష్టిగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వచ్చేనెల 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ పెట్ల భద్రాచలం, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ పాశపు నాగేశ్వరరావు, మార్కెట్ మాజీ ఉపాధ్యక్షుడు మూకల బాలకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు గోవిందరావు, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను పాల్గొన్నారు.

జి.కోడూరులో హీరో సాయిరాం ప్రచారం

మాకవరపాలెం : మండలంలోని జి.కోడూరులో నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ సోదరుడు, సినీహీరో సాయిరాంశంకర్ గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ గ్రామంలోని స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు వెలగా వెంకటరమణ, బొడ్డేటి బెంకటరమణ, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీనుతో కలసి సాయిరాంశంకర్ ఇంటింటి ప్రచారం చేశారు. ఆయనకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరలా సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం ఆశీస్సులతో నర్సీపట్నం నియోజకవర్గ అభివృద్ధికి నిర్విరామంగా కృషి చేస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్‌ను కూడా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల వివరాలతో ముద్రించిన పత్రాలను ఓటర్లకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ భద్రాచలం, సచివాలయ మండల కన్వీనర్ రమణ, జిల్లా కార్యదర్శి బొడ్డు గోవిందరావు, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

ఎస్.రాయవరం : అడ్డురోడ్డు మద్యం దుకాణం సమీపంలో వ్యక్తి వద్ద 20 మద్యం బాటిళ్లు ఉన్నట్టు గుర్తించి అదుపులోనికి తీసుకున్నామని ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. పరిమితికి మించి మద్యం సీసాలు కొనుగోలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

ఆయుర్వేదంలో ఆపరేషన్లు లేకుండా వ్యాధుల నివారణ



ఆయుర్వేద వైద్యం గురించి అవగాహన కలిగిస్తున్న వైద్యాధికారి శిరీష

కశింకోట: ఆయుర్వేద వైద్య విధానంలో శస్త్ర చికిత్సలు లేకుండా వ్యాధులను తగ్గించవచ్చని కన్నూరుపాలెం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాఖ వైద్యాధికారి టి. శిరీష అన్నారు. మండలంలోని కన్నూరుపాలెం ఆయుర్వేద వైద్యశాలలో గురువారం రోగులకు ఆయుర్వేద వైద్యంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిడ్నీలో రాళ్లు, సైనసైటిస్, టాన్సిలైటిస్, వెన్ను సమస్యలు, సయాటిక, ఆనెలు, మొలలు, వెరికోజ్‌సిస్ తదితర వ్యాధులను శస్త్ర చికిత్సలు అవసరం లేకుండా తగ్గించవచ్చునన్నారు. జలుబు, దగ్గు, గొంతునొప్పి,తలనొప్పి, అజీర్ణం, అతిసారం, గ్యాస్, గాయాలు నివారణకు చికిత్స అందించి ఉచితంగా మందులు అందించనున్నట్లు తెలిపారు. దీర్ఘకాలికమైన కీళ్ల వాతం, మోకాళ్ల నొప్పులు, పక్షవాతం, చర్మ వ్యాధులు, ఆస్తమా, ఎలర్జీ, మహిళల వ్యాధులు, బొల్లి, నరాలు, కండరాల వ్యాధులకు చికిత్స, మందులు ఉన్నాయన్నారు. తల్లి, పిల్లలు, గర్భిణులకు వైద్యం అందిస్తామన్నారు.

30న జాబ్‌మేళా

తుమ్మపాల: పట్టణంలోని డీమార్ట్ సమీపంలో గల శివ ఐటీఐ కళాశాలలో ఈ నెల 30న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కె.ఎస్.శివనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఫాక్స్‌కాన్, స్కైగార్డ్ ఎలక్ట్రానిక్స్, భారత్ బయోటెక్, ఇనిఫ్లోమ్, పానాసోనిక్, డిక్సాన్, ఇసుజు మోటార్స్, కెఎస్‌హెచ్,హోండాయ్, మోబీస్, జయభేరి కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల వయస్సు లోపు నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని పేర్కొన్నారు. ఆయా ఉద్యోగాలను బట్టి నెలకు రూ.12 నుంచి రూ.16 వేల వరకు జీతం, ఇన్సెంటివ్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం కల్పిస్తారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30 వ తేదీ ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరింత సమాచారం కోసం 9247836912, 9440641267 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

విద్యుత్ కార్యాలయం వద్ద ఉద్యోగుల నిరసన

కశింకోట: విద్యుత్ షాక్‌తో మృతిచెందిన జూనియర్ లైన్‌మెన్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఏపీఈపీడీసీఎల్ సబ్ డివిజన్(పూర్వపు ఆర్‌ఈసీఎస్) కార్యాలయం వద్ద సంస్థ ఉద్యోగులు, సిబ్బంది గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు మళ్ల పరదేశినాయుడు మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని మునగపాక మండలం చూచుకొండలో విధి నిర్వహణలో భాగంగా జూనియర్ లైన్‌మెన్ పీతల శివ సూర్యనారాయణ విద్యుత్ స్తంభం ఎక్కి షాక్‌తో కింద పడి మృతి చెందాడన్నారు. మృతుడి కుటుంబానికి అధికారులు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు గంగరాజు, వెంకట్, గోవింద, రమణ, చిన్న రాజు, జగదీష్ పాల్గొన్నారు.